# సీతాక్షేమ పత్రకం

## తెలుగువారి 'చింతచిగురు' సృష్టించిన

అదొక పూరిల్లు!

ఆ ఇంట్లో ఈ పూట కొంచెం హడావుడి కన్పిస్తోంది. లేకపోతే ఎపుడూ— నిదురించే సెలయేరు లాగా, శృతిచేయని వీణలాగా, అమాస రేయిలాగా ఆ ఇల్లు నిశ్శబ్దంతో నిండి ఉంటుంది. ఆ ఇంట్లో ఇప్పుడుంటున్నది ఇద్దరే! రామన్న, అతడి తల్లి. వయస్సు మళ్లే వేళ కొడుకునిచ్చి, భర్త పైలోకాలకి వెళ్లిపోయినరోజే రామన్న తల్లి జీవితంలో అమాస మబ్బులు కమ్ముకున్నాయి.

ఆనాటినుంచీ ఆమెకు కొడుకే లోకం, కొడుకే కైలాసం. వాణ్ణి అల్లారు ముద్దుగా పెంచుకుని ఆయన పోతూ పోతూ పెట్టిన అయోధ్య రామయ్య పేరు నిలపాలని అహర్నిశం శ్రమించింది. వాడికి వయస్సొచ్చింది. వయస్సుతోపాటు బుద్ధి, జ్ఞానంకూడా వచ్చాయి. యోగ్యుడు, బుద్ధిమంతుడు, చూడ చక్కనివాడు అయిన రామన్నకి సంబంధమూ వచ్చింది. వేలు విడిచిన మేనమామ పక్క వీధిలోనే ఉంటున్నాడు.

అతడికి నలుగురు కూతుళ్లు. పెద్దమ్మాయి సీతామహాలక్ష్మి బంగారం పోత పోసినట్టు ఉంటుంది. లంకను జయించి రావణుడ్ని నిర్జించి సీతాదేవిని వెంట పెట్టుకుని అయోధ్యలో పట్టాభిషేకం చేసుకున్నాక అజనాభ దేశంలో అంతటా సీతారాముల పేర్లు సర్వ సామాన్యమయ్యాయి. పళ్ళకూ సీతాఫలాలు,రామాఫలాలు అంటూ పేర్లొచ్చాయి.

అలాగే ఆ ఊళ్లోనూ రాముడూ సీతా వెలిశారు. అయినవాళ్ళు సంబంధం కలుపుకోవలసినవాళ్ళు, కావలసినవాళ్లూ కావడంతో పేర్లతోపాటు పెళ్లి ముచ్చట్లు కలిసిపోయాయి. తండ్రి లేని పెంపకం అని అనిపించుకోకుండా పెంచింది ఆమె. రాముణ్ణి వేలుచూపి ఎన్నేవాళ్లే కానీ వేలెత్తి చూపేవాళ్ళు ఎవరూ లేకపోవటంతో అతడి సంబంధం అందరికీ ఆమోదయోగ్యమే అయ్యింది. ఆ ఆమోదం కల్యాణ వేదికకు నడిపించి పెళ్లే జరిపించింది.

పెళ్లయితే అయ్యింది. కానీ సీతామహాలక్ష్మి కాపురానికి రాలేదు. అత్తారింటికి గృహప్రవేశం అయ్యింది. కాబట్టి రాకపోకలకు ఇబ్బంది లేదు. సూరీడులాగే సూర్యోదయంతో వచ్చి సూర్యాస్తమయంతో పుట్టింటికి వెళ్లిపోయేది. నేత నేయని పడుగు పేకల్లాగ ఉన్నారిద్దరూ.

ఇంతలో వచ్చేసిందీ అవాంతరం!

అయోధ్యలో సీతాదేవి అంతరంగం తెలుసుకుని మెలిగే సఖీజనంకోసం దేశంలో అన్వేషణ మొదలైంది. అజనాభ దేశంలోని అన్ని ప్రాంతాలనుంచీ అందం చందం ఉన్న అమ్మాయిల కోసం గాలింపు మొదలైంది.

రాజాంతఃపురం వైపు కన్నెత్తి చూసే అదృష్టం ఎవరికీ దక్కదు. అసలు జీవితంలో రాజధానికి వెళ్లి రాజప్రాసాదాలని చూసే అర్హత, యోగ్యత, అదృష్టం ఎవరికోకాని ఉండదు. అలాంటిది ఇష్టసఖిగా అడుగు పెట్టడం అంటే అదెంత అదృష్టం! అందునా రామాయణం అంత కథ నడిపించిన సాక్షాత్తూ లక్ష్మీదేవి అవతారం అయిన సీతాదేవి సేవ లభించడం అంటే మరీ అదృష్టంకాదూ! ఇటీవలికాలంలో యావత్తు అజనాభ దేశఖ్యాతి లభించిన మహారాణిగారాయె!

సీతామహాలక్ష్మికి నిండా పన్నెండేళ్లు. ఈడే రలేదు కానీ ఈడేరిన దానిలా షోడపు వర్షాల వసంతం తొంగి చూసిన పూసిన రసాలంలా ఉంటుంది. అత్తారింటికీ, పుట్టింటికీ తిరుగుతూ నాలుగు వీధుల జనాల దిష్టికళ్ళకూ దీపంలా ఉండే సీతామహాలక్ష్మి గ్రామపెద్ద దృష్టిలో పడింది. ఈ పసిడి రెమ్మ కొమ్మ అయ్యేదాకా అయోధ్యలో ఉంటే ఆమెకి పేరూ, తమ ఊరికి ప్రఖ్యాతి అనుకున్నాడా పెద్ద మనిషి. పహికర్తల లెక్కల్లో తప్ప పేరుకెక్కని దండకారణ్య ప్రాంతంలోని తమ గ్రామం అంతఃపురంద్వారా లెక్కల్లోకి ఎక్కుతుందని ఆశపడ్డాడు. ఆలోచన చేశాడు. అది సీతామహాలక్ష్మి



తండ్రికి ఆమోదదాయకంగా అనిపించి సరే అనేశాడు.

మమకారం నింపుకున్న రాముడితల్లి మాత్రం మమ అనలేకపోయింది. అయితే అత్తగారి హోదాలో ఆమె అభ్యంతరం చెప్పలేకపోయింది. పెద్దమ్మ నట్టిల్లులా ఉండే తమ పూరిల్లు రాణివాసం వెళ్లే సీతామహాలక్ష్మివల్ల, ఆ సీతారాముల దయవల్ల లక్ష్మీ నిలయంగా మారిపోతుందని ఊరంతా గోలపెట్టినట్టు క్షోభపెడితే ఆమెకి పన్నెత్తి మాటాడే అవకాశం లేకపోయింది.

కోడలిని నాలుగేళ్ళపాటు కళ్లారా చూసు కోలేకపోయినా ఆపై ఆమె కదలివచ్చే కలిమిత ల్లిలా వస్తుందని, తన దైవం రాముడి దయవల్ల తన తనయుడు రామన్న సుఖపడ్తాడని ఆశించి సరే అందా తల్లి.


సీతామహాలక్ష్మి రాణివాసం వెళ్లింది. గత

రామన్నతల్లి ప్రయాణానికి కావలసినవి అన్నీ సర్దేసింది. దారిబత్తెంగా జొన్న రొట్టెలు, ఉల్లికారం, సజ్జ అప్పాలు చేసిపెట్టింది. రామన్న మామ వడిగల గుర్రాన్ని తెప్పించాడు. ఈ దండకారణ్య ప్రాంతం నుండి ఊళ్లుదాటి, ఏళ్లుదాటి అడవులు దాటి అయోధ్య చేరేందు

రాజధానికి చేరుకోవచ్చు. కానీ ఇప్పుడు వచ్చింది యుద్ధ వారువం. తరంగంలా సాగే ఆ తురంగం మూడు పొద్దులు నిండకముందే అయోధ్య చేరుస్తుంది. రౌతు గట్టివాడై కళ్లాలు బిగించి

పట్టగలిగితే పట్టుమని పది లెక్కపెట్టేలోగా అది ఆమడ దూరం వెళ్లిపోతుంది. ఆ జవనాశ్వం రామన్నకి మచ్చికైంది.

# సీతమ్మోరి 'చింతాకు పతకం'



యామినీ సరస్వతి

అటు సీతమ్మ, ఇటు చింతాకూ రెండూ ధన్యమయిన వే

అన్నీ అమర్చిందామె.

ఇక బయలుదేరాలి రామన్న, ఆఖర్న ఇచ్చింది రామన్నతల్లి 'ఇది చింత చిగురు, దీన్ని తడిగుడ్డ చాటున పొడిగుడ్డ, పొడిగుడ్డ చాటున తడిగుడ్డ, పేర్చి పేర్చి మూటకట్టాను. అందులోనే కాసిన్ని చింతకాయలూ వేశాను. సీతకు చింతాకు పప్పన్నా, చింతకాయ పచ్చడన్నా ఎంతో ఇష్టం. ఇక్కడ ఈ పల్లెల్లో అయితే ఆకులూ, కాయలూ తింటాం మనం. అక్కడ ఆ అయోధ్యలో

నాలుగేళ్ళుగా ఏడాదికోసారి జరిగే రామలీల ఉత్సవాలకు రాజధానికి వెళ్లే సీతామహాలక్ష్మి తండ్రిద్వారా అక్కడి – అయోధ్య విషయాలు, విశేషాలు తెలిసేవి. కోడలు చెప్పి పంపిన కబుర్లతో ఏటికేడాది గడిపేరిద్దరూ!

ఇప్పుడీసారి రామన్నే వెళ్తున్నాడయోధ్య!

కైతే మామూలుగా పక్షంరోజులు పడుతుంది. శుద్ధ పంచమి బయలుదేరి వెన్నెల రాత్రుళ్ళూ పయనం సాగిస్తే బహుళ పంచమి జ్యోత్స్నకి

ఇవి తింటారో తినరో! పిల్ల వెళ్లి అయిదేళ్లు కావస్తోంది. కొత్తరుచి మరిగినా ఈ పాతరుచి మరిచిపోయి ఉండదు. పాతంటే గుర్తు వచ్చింది. కాసింత పాత చింతకాయ పచ్చడి మూట కట్టాను. ఎండుచింతాకు ఎండు మిరపకాయలూ కట్టాను. మిరియాల కారప్పొడి తప్ప ఆ ఉత్తరదేశ వాసులకు మ్రరుమనే మిరపకాయ ఘాటు ఏం తెలుసు ? ఎండలకూ, ఎండు మిరపకాయలకు మన ఆంధ్రదేశమే ప్రసిద్ధి. నాలిక తుప్పు వదిలేలా నాలుగు రోజులు తింటుంది నా కోడలు. ఒరే రామన్నా వెళ్లేప్పుడు వేవేగంతో వెళ్ళినా తిరిగొచ్చేపుడు తిన్నగా రా! తొందర్లేదు'

తల్లి మాటలకు తలూపాడు రామన్న.

ఇవ్వవలసినవన్నీ ఇచ్చి, చెప్పవలసిన నాలుగూ చెప్పిందామె. రాముడు పూరింటినుండి బయటికి వచ్చేసరికి సజ్జితాశ్వంతో వచ్చాడు అతని మామ.

గుర్రం రామన్నని చూసి సకిలించింది. గత వారంరోజులుగా దానికి మచ్చికై స్వారీ చేస్తున్నాడు రామన్న. అదతనికీ మచ్చికైంది. గుర్రం వెన్నుతట్టాడు రామన్న. అది మరోసారి సకిలించింది.

గుర్రం ఎక్కాడు రామన్న.


అందరి ఆనందబాష్పాలమధ్య గుర్రం చంగున దూకి కదిలింది.

రామన్న కళ్ళెం బిగించి, గుర్రం డొక్కలో నొక్కాడు. లఘుమేఘాలమీద స్వారీ ప్రారంభించింది గుర్రం.

ం౦౦౦౦ ౦౦౦౦౦ ౦౦౦౦౦

అనుకున్నట్టుగా రెండోనాడు చీకటి పడేవేళకు రాజధాని చేరుకున్నాడు రామన్న. గుర్రంపై వచ్చిన ఆ ఆంధ్ర యువకుడిని నగరం పొలిమేరల్లోనే ఆపేశారు భటులు. కాని, అతడు తన వహరా తన గ్రామ పూజ్యుడిచ్చిన లేఖ చూపగానే గుర్రాన్ని గుర్రపుశాలకి పంపించి అతన్ని పరదేశి మందిరానికి పంపారు.

అక్కడ దేశ రాజధానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రీకులకు, ఉద్యోగులకు, వారి వారి యోగ్యతానుసారం వారివారి అభిరుచిమేరకు ఆతిథ్యం లభిస్తుంది.




ఔత్తరాహులు వరి అన్నం లఘువుగా స్వీకరిస్తారు. దాక్షిణాత్యులు వరి అన్నాన్నే ఎక్కువగా భుజిస్తారు. ఆ తేడా చూసి వారికి ఆతిథ్యం ఇవ్వబడుతుంది. దేశ రాజధాని చేరిన వారెవ్వరైనా సరే అసంతృప్తితో తిరిగి వెళ్లరాదనేది దశరథుడి కాలంలో సుమంత్రులవారు చేసిన శాసనం. అది అక్షరాలా ఆచరణలో ఉంది.

రామన్న విడిదిచేరి, మారిన వాతావరణంలోనూ అలవాటుగా స్నానం చేసి తిరిగి దుస్తులు ధరించేసరికల్లా అతనికి వర్తమానం అందింది.

సరయూ తీరోద్యానంలో వాళ్లు కలుసుకోవచ్చు.

౦౦౦౦౦ ౦౦౦౦౦ ౦౦౦౦౦

రామన్న సహజంగానే అందగాడు.

పుట్టుకతో వచ్చిన అందానికి తోడు యవ్వనం తెచ్చిన నిగారింపు మరింత వన్నె తెచ్చింది. అతడి కోరమీసం, రెండు పాయలుగా తీసి వెనక్కి దువ్విన తుమ్మెద రెక్కల్లాంటి శిరోజాలు ప్రతిరోజు పొలంలో, ఇంట్లో పనిచేయడం వల్ల నిత్యవ్యాయామ కలితీకృత దేహయష్టిలా కండలు తిరిగిన శరీరం, దాదాపు ఆరడుగుల ఎత్తు, విశాలమైన కళ్ళు, కోటేరేసినట్టున్న ముక్కు, చదునైన నుదురు, నిండు చెక్కిళ్ళు బిగువైన దవడ కండరాలు, మరీ విశాలమైన ఛాతీ అతన్ని నలుగురితో సమానంగాకాక పదిపదుగురిలో ఒకడిగా చూపెడతాయి.

చుంగులుపోసి కుచ్చెళ్లు తీర్చి కట్టిన నారాయణవనం నేతపంచె, నిండు చేతుల కమీజు, కుచ్చులు విడిచిన తలపాగా, నడుముకి పట్టాతో తెలుగు యోధుడిగా కదిలిన రామన్నని అంతా కళ్ళప్పగించి చూశారు.

౦౦౦౦౦ ౦౦౦౦౦ ౦౦౦౦౦

ఓ మనిషి దారి చూపుతుండగా రాత్రి తొలిజాములో సగం మలిగిన తర్వాత సరయూ తీరానికి చేరుకున్నాడు రామన్న. సీతమ్మవారి ఇష్ట సఖీమణి సీతామహాలక్ష్మి ఆవేళకే అక్కడికి వచ్చి కూర్చుంది.

జాడ తెలిసినా విలాసం తెలిసినా పదే పదే రావడానికి వీల్లేని రాజనగరు కట్టుబాట్లమధ్య నాలుగేళ్లు నిండా గడిపిన సీతకి— తన వాడు, తనని మనువాడిన మనసైనవాడు, తనని వెదుక్కుంటూ తిరిగి తనని తన ఊరికి, తన ఇంటికి తోడుకొనిపోవడానికి వచ్చాడని తెలియగానే తన జీవితంలో పూర్ణచంద్రోదయకాలం వచ్చిందని తెలిసిపోయింది.

గుండె నిండా ఆనందంతో వచ్చి అతనికోసం


### లేలే నా రాజా

పియ్యేని పిల్చి చెప్పాడు మేనేజరు.

''చూడు సిక్స్ అవర్స్ బిజీగా ఉంటాను. చాంబర్‌లోకి ఎవర్నీ రానీయొద్దు''.

''సరే సరి. మళ్లీ ఎన్నింటికి లేపమంటార్ సార్''? వినయంగా అడిగాడు.

ఆర్.మురళి
హిందూపురం




అభిసారికలా వేచివుంది.

భార్యాభర్తలయ్యాక ఎడబాటెరుగని ఆ జంట ఇన్నేళ్ళ వియోగం తర్వాత కలుసుకున్న ఆ బావామరదళ్ళు క్షణంపాటు ఏదేమిటో తెలియని స్థితిలో ఉండిపోయారు.

సీత రామన్న గుండెలపై వాలిపోయింది.

ఇన్నేళ్ళ జీవితంలో పరిష్వంగ సుఖం అంటే ఏమిటో తెలియని రామన్నకి అది మన్మథుడి పూమాలలా అన్పించింది.

సేదదీరిన హృదయాలు బాసాడుకున్నాయి.

ఊసులు ముగిశాయి

ఊరి కబుర్లు ఆనందంతో తడిశాయి.

ఆ రాత్రి వేళ— ఆ వెన్నెల వెలుగుల్లో రామన్న— తల్లి తనతో పదిలంగా పంపిన చింతాకు, చింతకాయలు, చిగురు, చింతకాయపచ్చడి 'కానుక' అంటూ ఇచ్చాడు.

అంతేకాక— దారిభత్యంగా కట్టి ఇచ్చిన తమ సీమ జొన్నరొట్టె ఉల్లికారం కూడా ఇచ్చాడు.

కళ్ళల్లో నీళ్ళుబుకుతుండగా, నోరు మండుతున్నా ఇష్టంగా తింది సీత. మధ్యమధ్య ఓ రొట్టెముక్క తుంచి బావకీ తినిపించింది.

ప్రయాణ విషయం ముచ్చటించుకున్నారు.

మాఘ శుద్ధ పంచమి బుధవారం ఆర్ద్ర నక్షత్రంలో సూర్యోదయానికి ముందు రెండు గడియల వేళలో వారి ప్రయాణ ముహూర్తం నిశ్చయించినట్టుగా చెప్పింది సీత.

పది రోజుల పాటు నగరంలో ఉండడం నగర విశేషాలు చూడడం రామన్నకి ఉత్సాహంగానే ఉంది. ప్రతిరోజూ సరయూతీరంలో కలుసుకోవచ్చని చెప్పింది సీత.

తిరిగి వెళ్ళేలోగా సీతారాముల దర్శనం కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చింది. వైకుంఠం విడిచి భూలోక వైకుంఠం అయోధ్యలో కాపురం చేస్తున్న లక్ష్మీనారాయణులని కళ్ళతో చూడడం బొందితో వైకుంఠం వెళ్ళినట్టుగా భావించాడు రామన్న.

* * *

ఔత్తరాహులకి తెలియని ఆ వంటకాలు తనే చేసింది సీత! ఎండు మిరపకాయలు, ఎండు చింతాకు వేయించి పొడికొట్టింది. ఆ మిరపకాయల ఘాటు అంతఃపురమంతా అల్లుకుంది. పచ్చి చిగురుని, మిరపకాయలనీ వేయించి పచ్చడి చేసింది. కందిపప్పు ఉడికించి చిగురు పెట్టి ముద్దపప్పు చేసింది. పాత చింతకాయ పచ్చడి నూరి తిరగమోత పెట్టింది. కొత్త చింతకాయలు పచ్చడి కొట్టింది.

అన్నీ చేసుకున్నాక— అవి తనపాలి దైవమైన సీతాదేవికి చూపక, రుచి చూపక ఆరగించేందుకు ఇష్టపడలేదామె అన్నీ ఓ వెండి కంచెంలో అమర్చి, పెద్ద అరటి ఆకు మూతపెట్టుకుని అమ్మగారి మందిరానికి కదిలింది.

### ఫర్లేదు

"అక్కా! నువ్ పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే నాకు బోర్ కదూ..."

"నేను అత్తగారింటికి వెళ్తా... మావార్ని ఓ పదిరోజులు ఇక్కడ వుంచి వెళ్తాలే..."

పరధ్యాసగా చెప్పిందా కొత్త పెళ్ళికూతురు.

కుమారి కుంతల
నెల్లూరు

అమ్మగారి ఇష్టసఖీమణి కాబట్టి ఆమెకు ఏ వేళ అయినా ఏకాంత దర్శనానికి అభ్యంతరం ఉండదు. అనుజ్ఞా అవసరం లేదు.

ఘుమఘుమలాడుతున్న ఆ వంటకాలను చూసిన సీతాదేవి నోరూరింది.

'సీతా! ఈ రోజు ఆర్యపుత్రులు ఆరగింపుకి వస్తామన్నారే! మీ రాణిగారి కోసం నువ్వుతెచ్చిన ఈ ఆంధ్ర శాకాలు ఆ మా'రాజుకూ తినిపిస్తాను'

సీతమ్మవారి మాటలకి ఒక్క క్షణంపాటు నివ్వెరపోయినా— ఆ మరుక్షణం సీతామహాలక్ష్మి గుండెలు ఆనందంతో తాండవించాయి.

'నువ్వు దగ్గరుండి వడ్డన చూడు' అందా తల్లి.

ఏనుగెక్కినంత సంబరం అయిందామెకి.

* * *

సీతారాములిద్దరికీ బంగారుపళ్ళెరాల్లో వడ్డన జరిగింది. సీతాభోగాలవే ఆంధ్రదేశంతో వండిన బియ్యంతో వండిన అన్నం, ఔత్తరాహులు తినే పలుచని రొట్టెలు, వారు ఇష్టంగా తినే తీపి పదార్థాలు, నెయ్యి, కూరలు అన్నీ విడివిడిగా చిన్న చిన్న గిన్నెల్లో వడ్డించారు.

వాటి అన్నిటివీ కాదన్నట్టు— నాలుగు గిన్నెల్లో 'కొత్త' వంటకాలు

రామయ్యతండ్రికి ఆరగింపు పెడుతున్నందుకు సీతామహాలక్ష్మికి జన్మ ఫలించినంత ఆనందం ఉంది.

కళ్ళతోనే ప్రశ్నించాడు ప్రభువు.

సీతమ్మతల్లి సర్వం వివరించింది.

పట్టాభిషేకం ఆగిపోయి, భార్యతో తమ్ముడితో అరణ్యవాసం వెళ్ళిన రోజులు గుర్తొచ్చాయి. భరద్వాజ మహర్షి ఇచ్చిన విందులు 'ఆనాడు' భుజించిన ఆంధ్రుల శాకపాకాలు గుర్తొచ్చాయి.

నాలుక చుర్రుమంటున్నా, కళ్ళల్లో లీలగా నీళ్ళు కదులుతున్నా ఇష్టంగా తిన్నారిద్దరూ. సీతారాముల ఇష్టం కష్టంకళ్ళారా చూసిన సీతామహాలక్ష్మి తరతరలాడిపోయింది.

'చింత ... అంటే తింత్రిణీ వృక్షసంపదా ఇది?' రాములవారు అడిగారు భోజనానంతరం కదళీఫలాలు ద్రాక్షాఫలాలు సేవిస్తూ.

చారుడు తలూపాడు.

రాముడూ తలూపాడు. 'మా గురుదేవులు విశ్వామిత్రుల వారి సృష్టి ఆ మిరప పంట'

* * *

పదిరోజుల పాటు ప్రతిపూటా చిగురుపొడితో ఓ ముద్ద, చిగురుపచ్చడితో ఓ ముద్ద తిన్నాడు శ్రీరామచంద్రుడు. ఆ పది రోజులూ ఆయనగారితో పాటు అమ్మగారూ ముద్దు తీరేలా తిన్నారు. అయితే ఆ పది రోజుల్లోనూ అప్పుడే కాచిన ఆవునెయ్యి భారీగా ఖర్చైపోయింది.

* * *

పదిరోజుల తర్వాత ఓ ఉదయం అంతఃపురంలో ఓ గోడవారన ఓ మొలక తలెత్తింది. ఎప్పుడూ చూడని ఆ మొక్క అందరికీ ఆకర్షణకేంద్రం అయ్యింది. రామన్న వారితో గర్వంగా చెప్పాడు "అది చింత మొక్క!"

మరో పదిరోజులు గడిచాయి. చైత్రం వెళ్ళి వైశాఖం వచ్చేసింది. ప్రయాణం దగ్గరపడింది.

తిరిగి వెళుతున్న తన ఇష్టసఖికి ఏమేం ఇవ్వాలో రోజూ ఆలోచిస్తూ ఆజ్ఞలు జారీచేస్తోంది సీతమ్మతల్లి.

ఆరోజు చింతమొక్కని చూసిన ఆమె మనసులో ఏదో ఊహ మెరిసింది.


* * *

శ్రీరామ చంద్రమూర్తి, సీతమ్మవారూ కూర్చుని ఉన్నారు. వారి దగ్గర చేతులు కట్టుకుని నిలబడ్డాడు కంసాలి. విశ్వకర్మ ప్రతిరూపంగా పిలవబడే ఆయన ఆ రాచకుటుంబానికి ఆభరణాలు తయారు చేస్తాడు.

చింతాకురూపం.. ఆ చిన్ని ఆకు అందం వాటిని మాలగా కూర్చి మధ్యన పతకం వేసి చేసి హారం రూపకల్పన జరిగిపోయింది. శ్రీరామచంద్రుల వారు చిద్విలాసంగా నవ్వుతున్నారు.

'రాజులు కొత్తదనం కోరతారు అంటారే కానీ ఆడవారికే కొత్తదనంపై కోరికలు మెండు'

అయ్యగారి మాటలు అమ్మగారికి ఆనందం కల్గించాయి.




'నగ ఎప్పటికయ్యేను?'

'చిత్తం! రేపే పాటికి...'

తలూపాడు శ్రీరామచంద్రుడు 'రాణీ తలుచుకుంటే నగలకు కొదవా?'

'జంటహారాలు చేయండి!' సీతాదేవి అంది.

శ్రీరామచంద్రులవారి కనుబొమలు అలా కలిసి, ఇలా విడిపోయి, మనస్సులోని భావం పెదాలమీద మందహాసంగా వెలిసింది.

'అయితే నాలుగు— లేదా ఒకటి అనాలి. కానీ...' తన మనసులోని సందేహాన్ని మదిలోనే త్రుంచేసుకున్నాడు విశ్వకర్మ.

* * *

"సీతామహాలక్ష్మీ! దాదాపు ఐదు వసంతాలు నా ఆంతర్యం తెలుసుకుని మెలిగి అత్తారింటికి ఆంధ్రదేశం వెళుతున్నావు. కానుకల్తో పంపడం రాచధర్మం. శాశ్వతంగా ఉండేది. తీయని గుర్తుగా మిగిలేది ఏమిటా అని ఆలోచిస్తున్న నాకు అంతఃపురంలో మొలిచిన చింతమొక్క సరికొత్త ఆలోచనని మొలిపించింది.

విశ్వకర్మ చింతాకు పతకం తయారించాడు.

ఇప్పుడీ అజనాభ దేశంలో ఈ చింతాకుపతకాలు రెండే! ఒకటి జనకరాజపుత్రి శ్రీరామచంద్రపత్నీ అయిన ఈ సీతమెళ్ళో! మరోటి ఈ సీత మనస్సు చూరగొన్న ఈ చిన్ని సీతామహాలక్ష్మి మెళ్ళో! నా పేరు పెట్టినందుకు. నాతో కలిసిమెలసినందుకు ఈ చిహ్నం శాశ్వతం కావాలి. సీతా! నీ బావతెచ్చిన చింతకాయల్లోని విత్తనం మొలకెత్తింది. అది పెరిగి పెద్దదై పూచి, కాస్తే.... ఆ చిగురు తింటూ, ఆ కాయలు తింటూ ఉంటే మాకు మీరే గుర్తుకొస్తారు.

మరి మేం మీకు గుర్తుండేదెలా?

అందుకే ఈ చింతాకుపతకం..

వెళ్లి రండి!

సుఖంగా జీవించేందుకు ఏర్పాట్లుచేశారు ప్రభువులు.

పిల్లాపాపలతో వర్ధిల్లండి"

రామన్న, సీతామహాలక్ష్మి ఇద్దరూ ఆ ఇద్దరికీ సాగిలబడి నమస్కరించారు.

ఆంధ్రులు తరించారు. చింతాకు ధన్యమైంది.

ఈనాడు అయోధ్యలో చింతచెట్లున్నాయో లేదో నాకు తెలీదు కానీ ఓ చింతాకు పతకం మాత్రం భద్రగిరిలో సీతమ్మ వారి మెడలో వెలుగులు చిమ్ముతోంది. ఆ పతకం తయారీకి అలనాటి చింతాకు పతకమే ఆధారమేమో కూడా నాకు తెలీదు. ○

### జ్వరం

డాక్టర్ దగ్గరికొచ్చాడు తిరుమల్.

"నాకు చలిజ్వరం వచ్చింది డాక్టర్ గారూ!..."

"అరె... మీకెలా తెలుసు?"

"ఒళ్ళంతా చల్లగా ఉంటే నూ..."

సువర్ణ శ్రీనివాస్
నంద్యాల